క్లుప్తంగా

చెక్‌డ్యాంలు, చెరువుల వివరాలు నమోదు చేయండి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

మద్దికెర: మండలంలో అన్ని గ్రామాలలో వున్న చెరువులు, చెక్‌డ్యాంలకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డివిజనల్ ఉప గణాంక అధికారి రవిప్రకాష్ ఆదేశించారు. ఆయన సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతూ మండలంలో దాదాపు 375 చెక్‌డ్యాంలు, చెరువులు ఉన్నట్లు గుర్తించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నీటి నిల్వలు పెంచేందుకు చర్యలు తీసుకుంటోందని, సంబంధిత అధికారులు నీటి వనరుల వివరాలు పొందుపరచాలన్నారు. తహసీల్దార్ నాగభూషణం, డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, వీఆర్వోలు ఉన్నారు.

రీసర్వే గడువు పొడిగించాలి



గజ్జహళ్లి భూ సమస్యల గురించి వివరిస్తున్న రైతులు

హొళగుంద: గజ్జహళ్లి గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వే గడువును పొడిగించాలని రైతులు డిమాండ్ చేశారు. సోమవారం గజ్జహళ్లి సచివాలయానికి వచ్చిన రైతులు తమ భూ సమస్యల గురించి అధికారులకు వివరించారు. వారు మాట్లాడుతూ.. భూములు, యజమానులు, విస్తీర్ణం తదితర విషయాలకు సంబంధించి ఆన్‌లైన్ అడంగల్‌లో తప్పుగా నమోదయ్యాయని, వాటిని సరి చేయాలని కోరితే.. ఈ నెల 24న ఆఖరు తేది అని, ఆలోపు సమస్యలను పరిష్కరించుకోవాలని సూచిస్తున్నారని వాపోయారు. జిల్లా కలెక్టర్ స్పందించి గతంలో జరిగిన తప్పులను సరిచేసుకోవడానికి మరో 20 రోజుల గడువు ఇచ్చి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

అర్జీలను సత్వరం పరిష్కరించండి

కృష్ణగిరి: స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీల పట్ల సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండి సత్వరమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ రాజేశ్వరి ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను ఆమె స్వీకరించారు. అర్జీలను ఆయా శాఖల వారీగా అందజేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ సమస్యలపై వచ్చిన అర్జీల పట్ల వీఆర్వోలు క్షేత్రస్థాయిలో పరిశీలించి రెండు మూడు రోజుల్లో పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. ఎంపీడీఓ విశ్వమోహన్, ఏఓ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్పందనను సద్వినియోగం చేసుకోండి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

చిప్పగిరి: స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు లక్ష్మీనారాయణ మండల ప్రజలకు సూచించారు. సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన పలు వినతులు వారు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వినతులు పరిశీలించి తగిన పరిష్కారం చూపుతామన్నారు. ఎంపీడీఓ కొండయ్య, ఈఓపీఆర్డీ బాలన్న, ఏఓ విజయలక్ష్మి, ఏపీఎం నాగార్జున, విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ యల్లయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

తుగ్గలి: ఓటరు జాబితాలో పేరులేని వారు, కొత్తగా 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ రవి పిలుపునిచ్చారు. ముసాయిదా ఓటర్ల జాబితా సవరణ–2023 కార్యక్రమం డిసెంబర్ 9వ తేదీ వరకు ఉంటుందన్నారు. డిసెంబర్ 2, 3 (శని, ఆదివారాల్లో) ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సవరణలు ఉంటే సరైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

పాము కాటుతో రైతు మృతి



లక్ష్మన్న (ఫైల్)

కృష్ణగిరి: మండల పరిధిలోని చిట్యాల గ్రామ రైతు ఉలువ లక్ష్మన్న (65) సోమవారం పాము కాటుకు గురై మృతిచెందాడు. గ్రామ సమీపంలోని తన వరి మడికి నీరు పెట్టుకోవడంలో నిమగ్నమై ఉన్న లక్ష్మన్నను పాము కాటు వేసింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే కర్నూలులోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందాడు. ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య అనసూయమ్మ, నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ పెద్ద అకాల మరణంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్

నందవరం: అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ విరుపాక్షిరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ముగతిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య అధ్యక్షతన గ్రామ సచివాలయం–1లో ప్రజాప్రతినిధులు, అధికారులు సమావేశమై ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారి జాబితా బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలో జెండా ఆవిష్కరించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామ సచివాలయం–1 పరిధిలోని ప్రజలు వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.17.68 కోట్లు లబ్ధిపొందారని వివరించారు. జేసీఎస్ కన్వీనర్ చాంద్‌బాషా, బీఎల్ఓ బాబులాల్, పంచాయతీ కార్యదర్శి సుజాత, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: అభివృద్ధి, సంక్షేమం వైఎస్ జగనన్నతోనే సాధ్యమని, జగనన్నను మరోమారు సీఎంగా గెలిపించుకుందామని జేసీఎస్ మండల కన్వీనర్ మనోహర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని వేముగోడు గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డును అధికారులతో కలిసి వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్నారన్నారు. అవినీతికి తావు లేకుండా పూర్తి పారదర్శకంగా కుల, మత, ప్రాంత, వర్గ, పార్టీ తేడా లేకుండా పథకాలను అందజేస్తున్నారు కాబట్టే ఏపీకి మళ్లీ జగనే సీఎం కావాలన్నారు. అనంతరం సచివాలయం పరిధిలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధి వివరాలను వివరించారు. ఈఓఆర్డీ నాగేష్, పంచాయతీ కార్యదర్శి తోటయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు అధికారులు పాల్గొన్నారు.

జగనన్నకు అండగా నిలుద్దాం

కృష్ణగిరి: చరిత్రలో ఎన్నడూ ఎరుగని విప్లవాత్మక పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగనన్నకు మనమంతా అండగా నిలవాలని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ఆలంకొండ గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని సోమవారం ఆయన పార్టీ మండల కన్వీనర్ ఆర్‌బీ వెంకటరాముడు, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ మాధవరావు, సొసైటీ చైర్మన్ బ్రహ్మానందరెడ్డితో కలిసి ప్రారంభించారు. ముందుగా గ్రామ సచివాలయంలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలకు సంబంధించిన బోర్డును ఆవిష్కరించి అనంతరం పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ నాలుగున్నరేళ్లలో గ్రామ సచివాలయ పరిధిలో రూ.22.50 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించినట్లు వివరించారు. నాయకులు సుదర్శనాచారి, సచివాలయ కన్వీనర్లు ఆశోక్‌కుమార్, సురేష్, నవీనపాటి, రంగయ్య, రాజు, సుంకన్న, కృష్ణారెడ్డి, లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని పంచాయతీ కార్యదర్శి రామాంజినేయులు అన్నారు. సోమవారం ఉప్పర్లపల్లిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ సిబ్బందితో కలిసి ఆయన సంక్షేమ వివరాల బోర్డును ప్రదర్శించారు. నాలుగేళ్లలో ప్రభుత్వ పథకాల ద్వారా సచివాలయ పరిధిలోని పేదలకు రూ.21,63,89,130 లబ్ధి చేకూరినట్లు వివరించారు. వీఆర్వో గోవిందప్ప పాల్గొన్నారు.

మద్దికెర: అర్హత వుంటే చాలు సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే అందిస్తామని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి అన్నారు. సోమవారం మండల పరిధిలోని బురుజుల గ్రామంలో సంక్షేమ వివరాల బోర్డును ఆవిష్కరించారు. గ్రామ సచివాలయ పరిధిలో వివిధ పథకాల ద్వారా లబ్ధిదారులకు రూ.12.50 కోట్లు అందించినట్లు వారు వెల్లడించారు. కార్యదర్శి హరికృష్ణ, సొసైటీ అధ్యక్షుడు సుబ్బయ్య, మండల కన్వీనర్ గంపల వెంకటేశులు, నాయకులు జయభరత్‌రెడ్డి, అనిమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్దికెర: మండల పరిధిలోని బురుజుల గ్రామంలో సోమవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ జెండాను జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, నాయకులు జయభరత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకతను వివరించారు. సొసైటీ అధ్యక్షుడు సుబ్బయ్య, నాయకులు అనిమిరెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతో పథకాలు..చంద్రబాబుతో స్కాంలు

దేవనకొండ: స్కీం ఆంధ్రా కావాలా.. స్కాం ఆంధ్రా కావాలో ప్రజలు తేల్చుకోవాలని, టీడీపీకి మరోసారి ఓటుతో బుద్ధి చెబుదామని జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మల్లికార్జున పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం మండలంలోని నేలతలమరి గ్రామంలో 'ఏపీకి జగన్ మళ్లీ ఎందుకు కావాలి' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఆయన ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. రాష్ట్రాన్ని స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం, ఇసుక స్కాం, అమరావతి స్కాంలతో దివాలా తీయించిన మాజీ సీఎం చంద్రబాబునాయుడుకు మరోసారి ఓటుతో ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుందామని ప్రజలను కోరారు. మండల జేసీఎస్ కన్వీనర్ రాజారెడ్డి, నాయకులు లుముంబా, హంపిరెడ్డి, సహదేవ్, జయరాములు తదితరులు పాల్గొన్నారు.

చిప్పగిరి: మండలంలోని నేమకల్లు గ్రామంలో సర్పంచ్ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకతను గ్రామ ప్రజలకు వివరించారు. అనంతరం జగనన్న పాలనలో గ్రామంలో అందించిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను వివరిస్తూ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎంపీటీసీలు సుంకన్న, భీమలింగ, ఈఓపీఆర్డీ బాలన్న తదితరులు పాల్గొన్నారు.





ఆలంకొండలో సంక్షేమ వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, నేలతలమరిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తున్న నాయకులు

అభివృద్ధి చేసి చూపిన నాయకుడు జగనన్న

ఆలూరు రూరల్: రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసింది సీఎం జగనన్నే అని వైఎస్సార్‌సీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి అన్నారు. సోమవారం కమ్మరచేడు గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని పార్టీ మండలాధ్యక్షుడు వీరేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీపీ రంగమ్మ, సర్పంచ్ సుమతి రెడ్డి, సీనియర్ నాయకులు మల్లికార్జున రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గుమ్మనూరు నారాయణ స్వామి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీలన్ని నెరవేర్చారన్నారు. పేదలకు వివిధ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. దళారుల ప్రమేయం లేకుండా వలంటీర్ల ద్వారా అర్హులకు నేరుగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని కొనియాడారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు ప్రభుత్వం అందించి పథకాలను వివరించారు. అనంతరం సచివాలయం ఆవరణలో సంక్షేమ వివరాల బోర్డును ఆవిష్కరించి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. మండల సచివాలయ కన్వీనర్ ఈరన్న,నాయకులు దీపక్, అనీల్ రెడ్డి వీరేష్ తదితరులు పాల్గొన్నారు.



కమ్మరచేడు సచివాలయంలో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న గుమ్మనూరు నారాయణ స్వామి

● మంచి జరిగి ఉంటే ఆదరించండి



నెరణికిలో సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న గుమ్మనూరు ఈశ్వర్

హొళగుంద: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో మంచి జరిగిఉంటే మరోసారి ఆదరించాలని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు గుమ్మనూరు ఈశ్వర్ గ్రామస్తులను విన్నవించారు. ఆయన సోమవారం నెరణికి గ్రామంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే మళ్లీ ఎందుకు కావాలి' కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాలనపై ప్రజల అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను అందజేశారు. జగనన్న పాలనలో అర్హతే ప్రామాణికంగా కులం, మతం, పార్టీలు చూడకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న జగనన్నకు వచ్చే ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు. అంతకు ముందు సచివాలయంలో మాట్లాడారు. పార్టీ జెండను ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, నాయకులు ఈశా, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

● జగనన్నతోనే అందరికీ సమన్యాయం



కోతిరాళ్ల గ్రామంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీపీ నారాయణదాస్

పత్తికొండ రూరల్: పేద, సామాన్య, మధ్య తరగతి వర్గాల ప్రజలందరికీ న్యాయం జరగాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమని ఎంపీపీ నారాయణదాస్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కోతిరాళ్ల గ్రామంలోని సచివాలయం వద్ద సర్పంచ్ అంజినయ్య ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గడిచిన నాలుగేళ్ల పాలనలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. ఎంపీటీసీలు కృష్ణారెడ్డి, నెట్టికల్ తదితరులు పాల్గొన్నారు.



నేమకల్లులో సంక్షేమ వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం



ముగతిలో సంక్షేమ వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న గ్రామ సర్పంచ్ విరుపాక్షిరెడ్డి



ఉప్పర్లపల్లిలో సంక్షేమ వివరాల బోర్డును ప్రదర్శిస్తున్న సచివాలయ సిబ్బంది



బురుజుల గ్రామంలో సంక్షేమ వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న అధికారులు



బురుజులలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తున్న నాయకులు

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

నందవరం: గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని ఏపీఓ శ్రీనివాసులు ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఏపీఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్లెల్లో చేపడుతున్న ఉపాధి పనులకు కూలీల హాజరు పెంచాలన్నారు. కరువు మండలంలో ప్రతి కుటుంబానికి 150 రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. అలాగే 2024–25 ఆర్థిక సంవత్సరానికి పనులు గుర్తించాలని సూచించారు. రైతులకు ఉద్యాన పంటలపై అవగాహన కల్పించి పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈసీ నూర్జహాన్, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీడీ అల్లిపీరా

నష్టపోయిన రైతుల జాబితా సిద్ధం చేయండి



పంట నష్టపరిహారం జాబితా తయారీపై సమీక్షిస్తున్న ఏఓ అక్తర్‌బాష

వెల్దుర్తి(కృష్ణగిరి): ప్రభుత్వం వెల్దుర్తిని కరువు మండలంగా ప్రకటించడంతో పంట నష్ట పరిహారం నిమిత్తం అర్హులైన రైతుల జాబితాను వెంటనే పూర్తి చేయాలని ఏఓ అక్తర్‌బాష సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఆర్బీకేలో సోమవారం ఆయన మండలంలోని ఆర్బీకేల సిబ్బంది, తమ శాఖ సిబ్బందితో కరువు బాధిత రైతుల జాబితా తయారీపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ.. ఖరీఫ్‌లో 33,403 ఎకరాలలో వివిధ పంటలు సాగు చేసి నష్టపోయిన రైతుల జాబితాను సిద్ధం చేశామన్నారు. దాదాపు రూ.15 కోట్ల నష్ట పరిహారం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు. పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. రైతులు సమీప రైతు భరోసా కేంద్రాన్ని సంప్రదించి పంట నష్ట పరిహారం పొందేందుకు బ్యాంకు ఖాతా నంబర్, ఆధార్ నంబరు, పొలం పాస్ బుక్ జిరాక్స్ పత్రాలను సమర్పించాలని కోరారు. ఏఈఓ విలసిత, హెచ్‌ఈఓ సురేశ్, అన్ని ఆర్బీకేల వీఏఏ, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

20 టీఎంసీలకు పడిపోయిన నీటిమట్టం

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హోస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయంలో నీటిమట్టం 20 టీఎంసీలకు పడిపోయింది. గతేడాది ఇదే సమయానికి డ్యాంలో 97 టీఎంసీల నీరు నిల్వ ఉండేది. ఈ ఏడాది తీవ్ర వర్షాభావం వల్ల డ్యాంకు ఆశించిన స్థాయిలో నీరు చేరలేదు. సోమవారం డ్యాంలో 1599 అడుగులతో 20 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో కేవలం 78 క్యూసెక్కులుండి అవుట్‌ఫ్లో 9,783 క్యూసెక్కులుంది. టీబీ డ్యాం నుంచి కర్నూలు జిల్లాలోకి ప్రవహించే తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)కి సంబంధించి ఆంధ్రాలో కాలువ ప్రారంభం 250 కి.మీ వద్ద 594 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది.



టీబీ డ్యాం

నేడు 'ఫిష్ ఆంధ్ర' యూనిట్ ప్రారంభం

వెల్దుర్తి(కృష్ణగిరి): ప్రభుత్వ ప్రోత్సాహంతో వెల్దుర్తి హైవేలో ఏర్పాటు చేసిన 'ఫిష్ ఆంధ్ర' రెస్టారెంట్/హబ్‌ను 21వ తేదీ మంగళవారం ప్రారంభించనున్నట్లు జిల్లా మత్స్య శాఖాధికారి (డీఎఫ్ఓ) శ్యామల తెలిపారు. సోమవారం ఆమె తెలుపుతూ మత్స్య ఉత్పత్తుల వినియోగం పెంచడం, మత్స్యకారులకు ప్రోత్సాహం, మత్స్య పరిశ్రమ రంగానికి ఊతమిచ్చేందుకు ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. వెల్దుర్తి హైవేలో ఫిష్ ఆంధ్ర రెస్టారెంట్ ఏర్పాటుకు ముందుకొచ్చిన లబ్ధిదారుడికి పీఎంఎంఎస్‌వై కింద 60 శాతం సబ్సిడీతో రూ.20 లక్షల యూనిట్ మంజూరు చేయడం జరిగిందన్నారు. అలాగే బోయనపల్లెకు చెందిన లబ్ధిదారుడికి 'ఫిష్ ఆంధ్ర'కు అనుబంధంగా ఫోర్‌వీలర్ వెండింగ్ వెహికల్ 40 శాతం సబ్సిడీతో మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ రెండింటినీ మంగళవారం జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.



వెల్దుర్తిలో ఏర్పాటు చేసిన 'ఫిష్ ఆంధ్ర' యూనిట్

గ్రామ సేవకుడి మృతి

గోనెగండ్ల: మండల పరిధిలోని పెద్దమరివీడు గ్రామానికి చెందిన తలారి శ్రీనివాసులు (54) సోమవారం ఉదయం అనారోగ్యంతో మృతిచెందాడు. ఈయన గ్రామ సేవకుడిగా దాదా పు 20 ఏళ్లు పనిచేశారు. గ్రామంలో రెవెన్యూ సంబంధిత పనులను సకాలంలో నిర్వర్తిస్తూ ప్రజల ఆదరణ పొందారు. శ్రీనివాసులు మృతి చెందిన విషయం తెలుసుకున్న తహసీల్దార్ వేణుగోపాల్, ఆర్ఐ సుబ్బారెడ్డి, వీఆర్వోలు, వీఆర్ఏ సంఘం నాయకులు గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తలారి శ్రీనివాసులు అంత్యక్రియలకు రెవెన్యూ సిబ్బంది రూ.25 వేలు, వీఆర్ఏల సంఘం తరపున రూ.5 వేలు మృతుడి భార్య యంకమ్మకు ఆర్థిక సాయం అందజేశారు. వీఆర్వో ఉమర్, గ్రామ సేవకులు రంగన్న, హనుమంతు, నబీసాబ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.25 వేలు విరాళం

పత్తికొండ రూరల్: పత్తికొండలోని అయ్యప్పస్వామి దేవాలయంలో అన్నదానానికి మద్దికెర మండలం మదనంతపురం గ్రామానికి చెందిన అయ్యప్ప భక్తుడు నాగేష్ సోమవారం రూ.25 వేలు విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు దారామధుకు అందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఎమ్మిగనూరు టౌన్: రాష్ట్రస్థాయి అండర్–14 ఫుట్‌బాల్ పోటీలకు మాచాని సోమప్ప బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కేసీ సౌమ్య అనే విద్యార్థిని ఎంపికై నట్లు పాఠశాల హెచ్‌ఎం కె.కృష్ణమూర్తి, పీడీ (ఫిజికల్ డైరెక్టర్లు) కె.సుజనకుమారి, టీ.నాగేశ్వరి తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ.. విశాఖ జిల్లా భీమునిపట్నంలో ఈనెల 21వ తేదీ నుంచి జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో సౌమ్య పాల్గొంటుందని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారిణి సౌమ్యను హెచ్‌ఎం, పీడీ, ఉపాధ్యాయులు అభినందించారు.

పోషకాహార కిట్ల పంపిణీ

ఎమ్మిగనూరు టౌన్: క్షయ బాధితులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధి బారి నుంచి బయట పడవచ్చని డాక్టర్ అపర్ణ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఎమ్మిగనూరు మండల పరిధిలోని క్షయ వ్యాధిగ్రస్తులకు పవర్ గ్రిడ్ వారి సౌజన్యంతో పోషకాహార కిట్లను మండల వైద్యాధికారిణి డాక్టర్ అపర్ణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అపర్ణ మాట్లాడుతూ.. క్షయ వ్యాధిగ్రస్తులు తగు జాగ్రత్తలు పాటిస్తూ, సకాలంలో చికిత్స తీసుకోవడం, సరైన పౌష్టికాహారం తీసుకోవడం వలన జబ్బు బారి నుంచి త్వరగా కోలుకుంటారని తెలిపారు. టీబీ సూపర్‌వైజర్ చాంద్ బాష, హెచ్‌వీ సుమలత, సంపత్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన

దేవనకొండ: మండల కేంద్రంలో నిర్మితమవుతున్న గృహాలను హౌసింగ్ డీఈ ఆదినారాయణ సోమవారం పరిశీలించారు. లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పీఎం ఆవాస్‌దివాస్–ఆవాస్ సప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా గృహాలను పరిశీలించడం జరిగిందని, లబ్ధిదారులకు త్వరితగతిన బిల్లులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో మొత్తం 651 గృహాలు మంజూరయ్యాయని, ఇంకా చాలామంది లబ్ధిదారులు నిర్మాణాలు పూర్తి చేయలేదన్నారు. త్వరగా నిర్మాణాలను చేపట్టాలని సూచించారు. ఈనెల 26వ తేదీ వరకు ప్రతి గ్రామంలో గృహాలను పరిశీలించనున్నామని తెలిపారు. ఈయన వెంట అడ్మినిస్ట్రేషన్ అధికారి ఇద్రూష్‌బాషా, హౌసింగ్ సిబ్బంది నాయుడు, నాగరాజు తదితరులు ఉన్నారు.

యువకుడి అదృశ్యం



మధుశేఖర్ (ఫైల్)

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి పట్టణంలోని 5వ వార్డులో నివాసముంటున్న దాదిపోగు మధుశేఖర్ (30) అనే యువకుడు అదృశ్యమయ్యాడు. ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన దాదిపోగు మద్దిలేటి కుమారుడు మధుశేఖర్‌కు కృష్ణగిరి మండలం తొగర్చేడు గ్రామానికి చెందిన గీతతో వివాహం అయ్యింది. వీరికి కుమారుడు, ఇద్దరు కూతుళ్లు సంతానం. మధుశేఖర్ సెంట్రింగ్ పని చేసూకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిస కావడంతో మూడేళ్ల క్రితం ఇతని భార్య పిల్లలతో సహా పుట్టింటికి వెళ్లింది. అప్పటినుంచి మానసిక వేదనకు గురై మతిస్థిమితం లేనివాడిలా ప్రవర్తిస్తున్నాడు. ఈ నెల 19న తన పిల్లలను చూసి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తొగర్చేడులో పిల్లలను చూసి వచ్చినట్లు కుటుంబసభ్యులకు తెలియజేశాడు. సాయంత్రం మళ్లీ వెళతానని చెప్పగా వద్దని ఇంట్లో వారు వారించినా వినకుండా వెళ్లిపోయాడు. విషయాన్ని భార్యకు తెలపగా ఇక్కడికి ఉదయం మాత్రమే వచ్చి వెళ్లాడని మళ్లీ రాలేదని తెలియజేసింది. దీంతో పలుచోట్ల గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో సోమవారం తండ్రి మద్దిలేటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు

కృష్ణగిరి: కార్తీక మాసంలో మొదటి సోమవారం కావడంతో మండలంలోని అన్ని గ్రామాల్లోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఉదయం నుంచే భక్తులు శివపార్వతులకు అభిషేకార్చనలు చేశారు. చుంచుఎర్రగుడి గ్రామంలోని రామలింగేశ్వర స్వామికి వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పెనుమాడ గ్రామంలోని శివాలయంలో భక్తులు పెద్ద ఎత్తున స్వామికి అభిషేకాలు నిర్వహించారు. శివాలయంలో 1,001 జ్యోతులను భక్తులు వెలిగించారు. పలు శివాలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

మద్దికెర: మండలంలోని మద్దికెర, పెరవలి, ఎం.అగ్రహారం తదితర గ్రామాలలో కార్తీక మాసం సోమవారం కావడంతో పెద్ద ఎత్తున శివాలయాలలో మహిళలు దీపాలు వెలిగించి భక్తిని చాటు కున్నారు. గ్రామానికి 3 కి.మీ దూరంలో ఉన్న బుగ్గ సంగమేశ్వర దేవాలయంలో కార్తీక మాసం పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయంలో వివిధ ఆకృతులలో ముగ్గులు వేసి దీపాలు వెలిగించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు.



ముక్కెళ్లలో పూజలందుకున్న శివలింగం

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

ఆస్పరి: ఆస్పరిలో సోమవారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం లైబ్రేరియన్ విశ్వనాథరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, మండల సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన మాట్లాడుతూ విజ్ఞానాన్ని పెంచుకునేందుకు విద్యార్థులు ప్రతి రోజూ పుస్తకాలు చదవడం నేర్చుకోవాలన్నారు. ఏకాగ్రతతో చదివితే అనేక విషయాలను గుర్తించుకోవచ్చన్నారు. అనంతరం వ్యాస రచన, వక్తృత్వ, చిత్రలేఖనం, క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

ఆలూరు: స్థానిక గ్రంథాలయ శాఖ కార్యాలయంలో సోమవారం లైబ్రేరియన్ వెంకటేశ్వర్లు సమక్షంలో విద్యార్థులకు వివిధ రకాల క్రీడలు నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రభుత్వ బాలికల జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సుజాత సర్టిఫికెట్లతో పాటు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

నందవరం: స్థానిక లైబ్రరీలో గ్రంథాలయం శాఖ అధికారి వై.శివరామప్రసాద్ ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు నిర్వహించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



నందవరంలో బహుమతులు అందుకున్న విద్యార్థులు